నమస్తే తెలంగాణ
సిద్దిపేట
I | హైదరాబాద్, బుధవారం 4 డిసెంబర్ 2024 | SIDDIPET

# చక్రధర్ గౌడ్.. ముందు నీ నేర చరిత్ర తెలుసుకో..

సిద్దిపేటలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

- సభ్య సమాజం తలదించుకునేలా స్నేహితుడి భార్యపై హత్యాచారయత్నానికి ఒడిగట్టిన నీచ సంస్కృతి నీది..
- ఎన్ని పార్టీలు మారినా.. నీ నీచ బుద్ధి, నేర చరిత్ర మారదు
- చక్రధర్ గౌడ్‌పై మండిపడిన బీఆర్ఎస్ నేతలు

సిద్దిపేట, డిసెంబర్ 3: మచ్చలేని మనిషి హరీశ్‌రావుపై నిరాధార ఆరోపణలు చేసే ముందు చక్రధర్ గౌడ్ ఒక్కసారి నీ నేర చరిత్ర తెలుసుకోవాలని సిద్దిపేట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పాల సాయిరామ్, నంగునూరు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎడ్ల సోమిరెడ్డి, ఎల్లారెడ్డి, శ్రీకాంత్ గౌడ్ అన్నారు. మంగళవారం సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బీఆర్ఎస్ నాయకుడు ఎల్లారెడ్డితో కలిసి వారు మాట్లాడారు. ఎప్పుడు ఏ పార్టీలో ఉంటాడో తెలియని చక్రధర్‌కు హరీశ్‌రావు గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. నేర చరిత్ర, క్రిమినల్ చరిత్ర కలిగిన వారిని కాంగ్రెస్‌లో చేర్చుకోవడమే కాంగ్రెస్ నాయకులు పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగడుతున్నందుకే ప్రభుత్వం ఎమ్మెల్యే హరీశ్‌రావుపై క్షక్ష పూరితంగా వ్యవహరిస్తుందన్నారు. హరీశ్‌రావు గురించి సిద్దిపేట ప్రజలకు తెలుసునన్నారు. హరీశ్‌రావుపై పోటీ చేసిన ఏ కాంగ్రెస్ నాయకుడికి ఇప్పటివరకు డిపాజిట్ కూడా దక్కలేదన్నారు. హరీశ్‌రావు ప్రజా నాయకుడని, అలాంటి నాయకుడిని విమర్శిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా కనీసం ఒక్క నామినేట్ పోస్టు కూడా సిద్దిపేటకు ఇవ్వలేదని, హరీశ్‌రావుపై అసత్య ఆరోపణలు, అబద్ధాలు మాట్లాడిన వారికి ఇస్తామని, వారికి పోటీ పెట్టినట్లుగా కాంగ్రెస్ నాయకులు సిద్దిపేటలో వ్యవహరిస్తున్నారని ఎద్దేవా చేశారు. స్నేహితుడి భార్యను సోదరిలా భావించాల్సింది పోయి అత్యాచార యత్నం చేసిన చక్రధర్ మరోసారి హరీశ్‌రావుపై అసత్య ఆరోపణలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. మాటిమాటికీ సిద్దిపేట పేరు తీసే చక్రధర్‌గౌడ్ సిద్దిపేటపై అంత ప్రేమ ఉంటే సిద్దిపేట నుంచి కాంగ్రెస్ ప్రభుత్వం తరలించుకుపోయిన వెటర్నరీ కాలేజీని తిరిగి తీసుకురావాలని డిమాండ్ చేశారు. హరీశ్‌రావు అంటే ఏంటో సిద్దిపేట ప్రజలకు కాకుండా రాష్ట్ర ప్రజలందరికీ తెలుసునని, ఎవరు ఎన్ని అసత్య ఆరోపణలు చేసినా ప్రజలు వాటిని నమ్మరని బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. మీడియా సమావేశంలో మెరుగు మహేశ్, మాజీ సర్పంచ్‌లు లింగం, నరేశ్ గౌడ్, నాగుల ప్రశాంత్ గౌడ్, రమేశ్, సాయి ప్రేమ్, నాగరాజు, సాయి చరణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## జనవరి 11న బాడీ బిల్డింగ్ పోటీలకు ఎంపిక

మాట్లాడుతున్న బాడీ బిల్డింగ్ అసోసియేషన్ సభ్యులు

సిద్దిపేట అర్బన్, డిసెంబర్ 3: సిద్దిపేట జిల్లా అమోచూర్ బాడీ బిల్డింగ్ ఫిట్‌నెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వచ్చే సంవత్సరం జనవరి 11న సిద్దిపేటలోని విపంచి కళానిలయంలో జిల్లాస్థాయి బాడీ బిల్డింగ్ ఫిట్‌నెస్ పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు కొండం సంపత్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఏర్వ అశోక్ తెలిపారు. మంగళవారం సిద్దిపేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. 50 నుంచి 55, 55 నుంచి 60, 60 నుంచి 65, 65 నుంచి 70, 80 నుంచి 85 బరువుల విభాగాల పోటీలు నిర్వహిస్తామని, గెలుపొందిన వారికి బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. మిస్టర్ సిద్దిపేటగా గెలుపొందిన బాడీ బిల్డర్‌కు ప్రైజ్ మనీ అందజేస్తామని తెలిపారు. సమావేశంలో బాడీ బిల్డింగ్ అసోసియేషన్ కోశాధికారి బాలగోని సత్యం గౌడ్, కార్యవర్గ సభ్యులు సిద్దులు, శేఖర్, షౌకత్, అప్సర్, అథ్లెటిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వెంకటస్వామి పాల్గొన్నారు.

## నాడు పాసుబుక్ అన్నారు.. నేడు రేషన్‌కార్డుకు లింక్ పెట్టారు..

గుమ్మడిదల, డిసెంబర్ 3: అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెసోళ్లు..పాసుబుక్ ఉంటే పంట రుణమాఫీ చేస్తామన్నారు. నేడు రేషన్‌కార్డుకు లింక్‌పెట్టి పంట రుణమాఫీని ఎగ్గొట్టడానికి కుట్రలు చేస్తున్నారు. గుమ్మడిదల మండలం నాగిరెడ్డిగూడెంలో నాకు 4 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. దానిపై బ్యాంకులో రూ.లక్ష 80 వేలు పంట రుణం తీసుకున్న. మాది ఉమ్మడి కుటుంబం. మా ఇంట్లో నాలుగురికి నాలుగు పాసు పుస్తకాలు ఉన్నాయి. గతంలో పంట సబ్సిడీ కోసం ఎవరి పాసుపుస్తకం వారు చేసుకున్నాం. ఎవరి పొలానికి వారు పంట రుణం తీసుకున్నాం. అప్పుడు సీఎం రేవంత్‌రెడ్డి ప్రతి రైతుకు పంట రుణం మాఫీ చేస్తామన్నారు. రేషన్ కార్డు అందరికీ కలిసి ఒక్కటే ఉంది. ఉన్న నాలుగురికి కూడా రుణమాఫీ కాలేదు. ఇప్పుడు రేషన్ కార్డు ఒక్కటికే అని కొత్త మెలిక పెట్టారు. గతంలో కేసీఆర్ పంట పొలం మీద తీసుకున్న గోల్డ్ లోన్‌కు, పంట లోన్‌కు కూడా మాఫీ చేసిండు. ఇప్పుడు గోల్డ్‌లోన్‌కు వర్తించదని అంటున్నారు. ఇక జనవరిలో సంక్రాంతి తర్వాత రుణమాఫీ అని రైతులను మభ్యపెడుతుంది రేవంత్ సర్కార్. ఇదంతా రైతులు తీసుకున్న రుణాలను ఎగ్గొట్టడానికే అని తెలుస్తుంది. రైతులను నట్టేటా ముంచుతున్న సర్కారుకు రైతుల నుంచి తగిన గుణపాఠం తప్పదు.

– గడ్డం హన్మంత్‌రెడ్డి, రైతు, నాగిరెడ్డిగూడెం, గుమ్మడిదల మండలం, సంగారెడ్డి జిల్లా

- వేలాదిమంది రైతుల ఆశలు అడియాసలు
- రేవంత్ ప్రభుత్వంపై భగ్గుమంటున్న రైతులు
- కాంగ్రెస్ సర్కార్ నిండా ముంచిందని మండిపాటు
- ఆందోళనకు సిద్ధమవుతున్న అన్నదాతలు

# రుణమాఫీ కాలే..

## మాఫీ చేసినట్లు గొప్పలు చెప్పకుంటున్న కాంగ్రెస్ సర్కార్

సిద్దిపేట, డిసెంబర్ 3 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): సీఎం రేవంత్‌రెడ్డి సాబ్ ఎన్నికల ముందు ఏం చెప్పారు... ప్రతి రైతుకూ రూ.రెండు లక్షల రుణమాఫీ చేస్తానని చెప్పితివి.. ఇప్పుడేమో ఏవేవో కొర్రీలు పెట్టి పంట రుణమాఫీ చేయకపోతివి.. రోజూ బ్యాంకుల చుట్టూ, వ్యవసాయ అధికారుల వద్దకి పోవడితిమి.. వాళ్లేమో మాకు తెల్వదు.. మీ సీఎంను అడుక్కో పోండ్రి అనవట్టిరి. మరి ఎట్లా .? మాకు పంట రుణమాఫీ అయతదా..? కాదా..? మీది పైసలు కట్టమంటే అట్లా కూడా కడితిమి ..అట్లయినా మాకు రుణమాఫీ కాకపాయే ..మా పరిస్థితి ఏంటి అని ..? నాలుగు విడతల్లో పంట రుణమాఫీ కానీ రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇలా ఏ గ్రామంలో చూసినా రైతులు తమ ఆవేదనను వెల్లబోసుకుంటున్నారు. కాంగ్రెస్ సర్కార్ రైతులను నిండా ముంచిందని, పంట రుణమాఫీ చేస్తానని ఎగ్గొటిందని రేవంత్ సర్కార్‌పై మండిపడుతున్నారు. ఒకటి, రెండు, మూడు, నాలుగు విడతలుగా రుణమాఫీ చేశామని ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటుంది. నాలుగో విడతలో సిద్దిపేట జిల్లాలో 9,063 మందికి, మెదక్ జిల్లాలో 7,248 మందికి, సంగారెడ్డి జిల్లాలో 11,301 మంది రైతులకు పంట రుణమాఫీ చేసినట్లు ప్రభుత్వం చెబుతోంది.

### మాఫీ కానీ రైతులు వేలల్లో...

నాలుగు విడతల్లో మాఫీ కానీ రైతులు వేల మంది ఉన్నారు. వారికి కూడాపంట రుణమాఫీ చేసి కాంగ్రెస్ ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఇవ్వాళ గ్రామాల్లో ఎక్కడా చూసినా తమకు పంట రుణమాఫీ కాలేదంటూ రైతులు గోడు వెల్లబోసుకుంటున్నారు. రుణమాఫీ కాని వారు దరఖాస్తు చేసుకోమ్మంటే చేసుకున్నాం. ఇగ మాఫీ అయతది అనుకున్నాం.. కానీ ఈ ప్రభుత్వం రుణమాఫీ చేస్త లేదు. కేవలం కొంత మందికే చేసి చేతులు దులుపుకుంటుందని వారు ఆరోపిస్తున్నారు. రూ. రెండు లక్షల రుణమాఫీ చేస్తానన్న ప్రభుత్వం వెంటనే అందరికి రుణమాఫీ చేయాలని కాంగ్రెస్ సర్కార్‌ను రైతులు డిమాండ్ చేస్తున్నారు. రేషన్ కార్డు ప్రమాణికంగా తీసుకున్న ప్రభుత్వం ఆ కుటుంబానికి రూ.రెండు లక్షలు అయితే మాఫీ చేయాలి కదా..? అలా ఎందుకు చేయడం లేదని ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. రూ.రెండు లక్షల మాఫీ డబ్బులు రైతుల క్రాప్‌లోన్ అకౌంట్‌లో జమ చేస్తే ఆపైన ఉన్న డబ్బులు రైతులు కట్టి రుణాలు రెన్యూవల్ చేసుకుంటారు కదా.. అలా చేయకుండా కుంటిసాకులు చెబుతోందని రైతులు ఆరోపిస్తున్నారు. రైతులకు పంట రుణమాఫీ డబ్బులను ఎగ్గొట్టాలనే పనిలో ఉందని రైతులు మండిపడుతున్నారు. యాసంగి సాగు ప్రారంభమయింది. ఇంత వరకు రుణమాఫీ లేదాయే... రైతు భరోసా లేదాయే అని రైతులు అంటుండగా, కాంగ్రెస్ నేతలు కూడా రుణమాఫీపై అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. అధికార పార్టీలో ఉన్న తమకు కూడా రుణమాఫీ కాకపోయే ఇదేమి ప్రభుత్వం అంటూ వారిలో వారే గుసగుసలాడుకుంటున్నారు. పార్టీలతో సంబంధం లేకుండా రైతులను కాపాడుకుంటేనే భవిష్యత్తు ఉంటుందని పేర్కొంటున్నారు.

### ఇంతవరకు రుణమాఫీ కాలేదు

రామాయంపేట, డిసెంబర్ 3: కాంగ్రెస్ సర్కార్ నాలుగు విడతలు పంట రుణమాఫీ చేసినమని చెబుతున్నా.. నాకు ఇంతవరకు పంట రుణమాఫీ కాలే... రామాయంపేట మండలం ఝాన్సిలింగాపూర్ గ్రామంలో నాకు, నా భార్యకు కలిసి మొత్తం 3 ఎకరాల 16 గుంటల భూమి ఉంది. నా భార్య సునీత పేరిట ఎకరం 20గుంటలు, నా పేరిట ఎకరం 36 గుంటల భూమి ఉంది. మా ఇద్దరి పేరిట మంజీరా బ్యాంకులో నా పేరిట రూ.లక్ష 35 వేలు, నా భార్య పేరిట రూ.లక్ష 78వేలు అప్పు ఉంది. ప్రభుత్వం ఇన్ని విడతలు పంట రుణమాఫీ చేసిన మాకు కాలేదు. బ్యాంకు వారిని, వ్యవసాయ శాఖ అధికారులను ఎన్నిసార్లు అడిగినా వచ్చే విడతలో వస్తుంది.. అంటూ దాటవేస్తున్నారు. తిరిగి తిరిగి చెప్పులు అరిగినయ్ తప్ప... మాకు ఒక్కపైసా కూడా రుణమాఫీ కాలేదు. ఇవ్వాల, రేపు అంటూ అధికారులు జరుపుతున్నారు. మాకు పంట రుణమాఫీ అయితదని నమ్మకం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నమ్మే పరిస్థితి లేదు. బీఆర్ఎస్ ప్రభుత్వమే సక్కగుండె.

– బానప్పగారి నర్సారెడ్డి, రైతు, ఝాన్సిలింగాపూర్, రామాయంపేట మండలం, మెదక్ జిల్లా

### కాంగ్రెసోళ్లు చెప్పిన మాటలు... చేతల్లో చూపడం లేదు...

కొమురవెల్లి, డిసెంబర్ 3: కొమురవెల్లిలోని ఏపీజీవీబీలో ఆరేండ్ల క్రితం రూ.లక్ష వరకు రుణం తెచ్చుకున్నా. ప్రతి ఏడాది రెన్యూవల్ చేస్తున్నా. ఏడాది క్రితం జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ రైతులకు రూ.2 లక్షలు మాఫీ చేస్తామని చెప్పడంతో ఆశతో చూసిన. కానీ నా పేరు మూడు విడతల పంట రుణమాఫీ లిస్ట్‌లో రాలేదు. బ్యాంకుకు వెళితే అప్పు రూ.2 లక్షల 5వేలు ఉందని, 5వేలు కట్టమన్నారు. 5వేలు కట్టినా, నీ పేరు పైకి పంపుతమన్నారు. ఏమైనా తప్పులు ఉన్నవి సరిచేసి 4వ విడతలో విడుదల చేస్తామంటే కచ్చితంగా రుణమాఫీ అయితది అనుకున్నా, కానీ నాలుగో లిస్ట్‌లో కూడా నా పేరు లేదు. ఇంకా రుణమాఫీ పూర్తయిందని సీఎం రేవంత్ సార్ అంటుండు. ఏ ఊర్లో ఎంతమందికైందో కానీ, మా ఊర్లో మాత్రం నాలాంటి రుణమాఫీ కానివాళ్లు 20 మందికి పైగానే ఉన్నారు. ప్రభుత్వం రుణమాఫీని ఏ లెక్కన పరిగణలోకి తీసుకుందో కానీ, చాలామందికి రుణమాఫీ జరుగలేదు. ప్రభుత్వం చెప్పిన మాటలు చేతల్లో చూపడం లేదు.

– బచ్చల రమణ, మహిళా రైతు, గురువన్నపేట, కొమురవెల్లి మండలం, సిద్దిపేట జిల్లా

# బడి తాళం తీయకుండా ఎస్ఎంసీ చైర్మన్ల ధర్నా

## మనఊరు-మనబడి బిల్లులు ఇవ్వడం లేదని కాంట్రాక్టర్ల నిరసన

- రెండేండ్లు గడిచినా ఇప్పటి వరకు బిల్లులు రాలేదని ఆవేదన
- మెదక్‌లోని ప్రభుత్వ బాలికల పాఠశాల ఎదుట ధర్నా
- జిల్లాలో రూ.10 కోట్ల బిల్లులు పెండింగ్
- పాఠశాలలోకి వెళ్లకుండా గంటపాటు వేచి ఉన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



మెదక్‌లోని ప్రభుత్వ బాలికల పాఠశాల వద్ద ధర్నా చేస్తున్న ఎస్ఎంసీ చైర్మన్లు

మెదక్, డిసెంబర్ 3 (నమస్తే తెలంగాణ): మనఊరు-మనబడి కింద పలు పాఠశాలల్లో పనులు చేపట్టిన కాంట్రాక్టర్లకు ఆర్థిక ఇబ్బందులు తప్పడం లేదు. చేపట్టిన పనులు పూర్తి చేసి నెలలు గడుస్తున్నా.. ఇప్పటివరకు బిల్లులు రాక, చేసిన అప్పులు కుప్పలుగా పేరుకుపోతుండడంతో వారంతా ఆందోళన చెందుతున్నారు. దీంతో మంగళవారం జిల్లా కేంద్రంలోని బాలికల పాఠశాల తాళం తీయకుండా ఎస్ఎంసీ చైర్మన్లు ధర్నా చేశారు. దీంతో పాఠశాల లోపలికి వెళ్లే విద్యార్థులు గంటపాటు బయటే వేచి ఉన్నారు. ఈ సందర్భంగా ఎస్ఎంసీ చైర్మన్లు దశరథం, శంకర్, శ్రీనివాస్ మాట్లాడుతూ... మన ఊరు-మన బడి కింద చేసిన పనికి సంబంధించి పనులు చేసి దాదాపు రెండేండ్లు గడిచినా ఇప్పటివరకు బిల్లులు రాలేదని వాపోయారు. ఉపాధ్యాయులను, విద్యార్థులు పాఠశాలలోనికి వెళ్లకుండా అడ్డుకున్నామని తెలిపారు. జిల్లాలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో మన ఊరు-మన బడి కింద చేసిన పనులకు బిల్లుల విషయంలో స్పష్టమైన హామీ ఇస్తే తప్ప ఆందోళన విరమించేది లేదని భీష్మించుకుకూర్చున్నారు. బంగారం తాకట్టు పెట్టి, అప్పులు తెచ్చి పనులు చేశామని, వడ్డీలు కట్టలేకపోతున్నామని తెలిపారు. బిల్లులు చెల్లించకపోతే మండలాల్లోని పాఠశాలలకు కూడా తాళం వేస్తామని హెచ్చరించారు. జిల్లాలోని ఎస్ఎంసీ చైర్మన్లు దశరథం రూ.12 లక్షలు, చిన్నఘణపూర్‌కు చెందిన శంకర్ రూ.14 లక్షలు, అవుసులపల్లి లక్ష్మణ్ రూ.6.50 లక్షలు, వడ్డెర కాలనీ సాయిలు రూ.3 లక్షలు, మక్తభూపతిపూర్ ముష్టి శ్రీనివాస్ రూ.12 లక్షలు. మెదక్ జిల్లావ్యాప్తంగా రూ.10.64 లక్షల మన ఊరు-మన బడి బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. బిల్లుల విషయమై ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణిలో కూడా ఫిర్యాదు చేశామని తెలిపారు. విషయం తెలుసుకున్న ఎంఈవో నీలకంఠం వారితో మాట్లాడి చేసిన పనులకు బిల్లులు ఇప్పిస్తామని చెప్పడంతో ధర్నా విరమించారు.

పాఠశాలకు తాళం ఉండడంతో బయటే ఉన్న విద్యార్థినులు

# రీజినల్ రింగ్‌రోడ్డుకు భూమి ఇవ్వడం శుభ పరిణామం

- సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి

మాట్లాడుతున్న కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేట కలెక్టరేట్, డిసెంబర్ 3: సిద్దిపేట జిల్లాలోని గజ్వేల్ నియోజకవర్గం గుండా రీజినల్ రింగ్ రోడ్ వెళ్తున్నందున ఈ ప్రాంత అభివృద్ధికి భూమి ఇవ్వడానికి ఒప్పుకున్న ఆయా గ్రామా ల ప్రజలకు కలెక్టర్ మనుచౌదరి కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో రీజినల్ రింగ్ రోడ్డు వల్ల భూమి కోల్పోతున్న ఆయా గ్రామాల రైతులతో కలెక్టర్ మనుచౌదరి సమావేశం నిర్వహించారు. భూమే ఆధారంగా.. వ్యవసాయమే బతుకుదెరువుగా జీవనం సాగిస్తున్నామని, అలాంటి భూమిని రీజినల్ రింగ్ రోడ్డుకు తీసుకోవడం అత్యంత బాధాకరమైన విషయమన్నారు. అయినా ఈ ప్రాంత అభివృద్ధి కోసం భూమి ఇవ్వడానికి సముఖంగానే ఉన్నామన్నారు. నష్ట పరిహారం విషయంలో ప్రత్యేక చొరవ చూపి బహిరంగ మార్కెట్‌లో ప్రస్తుతం ఉన్న ధర ఇప్పించాలని ఆయా గ్రామాల రైతులు కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఈ ప్రాంత అభివృద్ధి కోసం భూమి ఇవ్వడానికి ఒప్పుకోవడం శుభపరిణామమని తెలిపారు. ఆయా గ్రామాల్లో భూమి విలువను మీరు తెలిపిన విధంగా నోట్ చేసుకొని రాష్ట్రస్థాయి అధికారులకు పంపించి అందరికీ న్యాయం చేయడానికి కృషి చేస్తానని కలెక్టర్ రైతులకు తెలిపారు.

# ఇథనాల్ పరిశ్రమలను రద్దు చేయాలి

మాట్లాడుతున్న అఖిలపక్షం నాయకులు

బెజ్జంకి, డిసెంబర్ 3: సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలంలో నిర్మించే ఇథనాల్ పరిశ్రమలను వెంటనే రద్దు చేయాలని అఖిలపక్షం నాయకులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో బీఆర్ఎస్, సీపీఎం, సీపీఐ, బీజేపీ, బీఎస్పీ నాయకులతో ఏర్పాటు చేసిన అఖిలపక్ష పార్టీల సమావేశంలో వారు మాట్లాడుతూ..ఇథనాల్ పరిశ్రమల నుంచి వెలువడే వ్యర్థాలతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడే ప్రమాదం ఉందని, పరిశ్రమలతో కలిగే అనార్థాలపై ప్రజలకు అవగాహన కల్పించి పోరాటం చేసేందుకు అఖిలపక్ష పార్టీలు సిద్ధంగాఉన్నాయని తెలిపారు. ప్రజలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి అఖిలపక్ష నాయకులకు సహకరించాలని కోరారు. సమావేశంలో లింగాల లక్ష్మణ్, తిప్పారపు శ్రీనివాస్, వెంకట్‌రెడ్డి, కొలిపాక రాజు, సావనపల్లి రాజు, బోనగిరి రూపేశ్, సంగెం మధు, సాయికృష్ణ, రమేశ్ ఉన్నారు.

మాట్లాడుతున్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

# ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం కృషి

- మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్

మెదక్, డిసెంబర్ 3 (నమస్తే తెలంగాణ): ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం కృషి చేస్తుందని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. జిల్లా కేంద్రంలో మున్సిపల్ కార్మికులకు ఆరోగ్య పరీక్షలను విజయవంతంగా నిర్వహించడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు జిల్లాలో ఇలాంటి అవగాహనకు కార్యక్రమాలు మరింతగా నిర్వహించి, ప్రజల్లో ఆరోగ్యంపై చైతన్యం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వం రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని రూ.5లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచి కార్పొరేట్ వైద్యసేవలు అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. మున్సిపాలిటీలో 150 మంది పారిశుధ్య సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారని, వారందరికీ 50 రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహించామని తెలిపారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్ మాట్లాడుతూ.. ఆరోగ్యంపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమాల్లో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ జాయింట్ డైరెక్టర్ సంధ్య, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి శ్రీరామ్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ నవీన్, మెడికల్ ఆఫీసర్లు, మున్సిపల్ శానిటేషన్ వర్కర్లు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# తలనొప్పిగా మల్లన్న ఆలయ పాలకమండలి నియామకం

## మంత్రి, ఎంపీ, నియోజవకర్గ ఇన్‌చార్జి సిఫారసు చేసినా ఫలితం శూన్యం

- కేసులున్నాయంటూ ఆమోదించని దేవాదాయ శాఖ కమిషనర్
- 8 మందితో కమిటీని నియమిస్తూ జీవో జారీ
- కొత్తగా దరఖాస్తు చేసుకోవాలని మరో జీవో

కొమురవెల్లి మల్లన్న ఆలయం

చేర్యాల, డిసెంబర్ 3: కొమురవెల్లి మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 28 నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో మల్లన్న ఆలయ పాలక మండలి నియామకం అందరికీ తలనొప్పిగా మారింది. దేవాదాయ శాఖ నోటిఫికేషన్ జారీ చేయగానే నిబంధనల ప్రకారం ఆలయ ధర్మకర్తల మండలికి 72 మంది అధికార పార్టీ నాయకులు, కార్యకర్తలు దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తు చేసుకున్న వారిలో కొంతమందితోపాటు జనగామకు చెందిన ఓ నాయకుడిని చైర్మన్‌గా నియమించాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డితో పాటు జనగామ నియోజవర్గ ఇన్‌చార్జి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి సిఫారసు లేఖలను దేవాదాయ శాఖ రాష్ట్ర కమిషనర్‌కు ఇటీవల పంపించారు. వారు పంపించిన సిఫారసు లేఖలో పేరున్న నాయకుడిపై కేసులు నమోదై ఉండడంతో దేవాదాయ శాఖ చట్టంలోని నిబంధనల మేరకు ఆలయ పాలక మండలి లేదా ఉత్సవ కమిటీలో చోటు కల్పించే అవకాశం లేకపోవడంతో దేవాదాయ శాఖ కమిషనర్ సదరు నాయకుడి పేరును కాకుండా ఇతరులతో కమిటీ నియమిస్తామని చెప్పడంతో అధికార పార్టీ నేతలు తలలు పట్టుకుంటున్నారు. స్వామి వారి బ్రహ్మోత్సవాలు సమీపిస్తుండడంతో వెంటనే కమిటీని నియమించాలని కోరుతూ మంగళవారం పలువురు నేతలు ప్రభుత్వ ప్రత్యేక సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డిని సైతం కలిసినట్లు తెలిసింది.

### 8 మంది సభ్యులతో కమిటీ

కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయ కమిటీని నియమిస్తూ దేవాదాయ శాఖ అధికారులు మంగళవారం జీవో 463 జారీ చేశారు. అందులో చిగారీ కొమరయ్య, కాయితా మోహన్‌రెడ్డి, లింగంపల్లి శ్రీనివాస్, అల్లం శ్రీనివాస్, వల్లాద్రి అంజిరెడ్డి, మామిడాల లక్ష్మి, నేరెల్లపల్లి మహేందర్‌రెడ్డి, కొప్పురపు జయప్రకాశ్‌రెడ్డికి చోటు కల్పించారు. అనంతరం ఆలయ ధర్మకర్తల మండలి చోటు కోసం తాజాగా దరఖాస్తు చేసుకోవాలని జీవో 464ను జారీ చేశారు. ధర్మకర్తల మండలిలో 14 మంది సభ్యులు ఉండాల్సి ఉంటుంది, 8మందిని నియమించగా, మిగిలిన ఆరుగురు సభ్యుల కోసం మరో జీవో జారీ చేశారు. ఇప్పటికే 72 మంది దరఖాస్తు చేసుకోగా, నూతనంగా మరో జీవో జారీ చేసి తిరిగి దరఖాస్తు చేసుకోవాలని కోరడం వెనుక మతలబు ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు.

# పంట రుణమాఫీ కోసం రైతుల నిరసన

సిద్దిపేట జిల్లా రాయపోల్ రైతు వేదిక వద్ద నిరసన తెలుపుతున్న కొత్తపల్లి రైతులు

రాయపోల్, డిసెంబర్ 3: పంట రుణమాఫీ కోసం సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన రైతులు మంగళవారం రాయపోల్ రైతు వేదిక వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఎన్నికల్లో రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేసి తీరుతామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ సంవత్సరం గడుస్తున్నా ఇంత వరకు రుణమాఫీ జరగకపోవడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం నిబంధనల ప్రకారం కుటుంబ సభ్యుల్లో ఎవరికైనా ఒకరికి పంట రుణమాఫీ కావాల్సి ఉన్నా కాలేదన్నారు. నాలుగు విడతలుగా పంట రుణమాఫీ అయితదని ఎంతో ఆశతో ఎదురుచూసినా నిరాశే మిగిలిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం చర్యలు తీసుకొని నిబంధనల ప్రకారం అర్హులైన రైతులకు పంట రుణమాఫీ చేసి తమను ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.